## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



నిరంతర వార్తా ప్రవాహం
RNI NO:APTEL16151
# జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers
JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:235 | సోమవారం మార్చి 23, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# భారత్ చేరిన అమెరికా ఎల్పీజీ నౌక




●సరఫరా అంతరాయం: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల దేశంలో చమురు, ఎల్పీజీ (ప్రూ+) సరఫరా గొలుసుకు ఆటంకం ఏర్పడి కొరత తలెత్తింది.

●అమెరికా నుంచి ఎల్పీజీ: భారత్‌కు ఊరటనిస్తూ అమెరికాలోని టెక్సాస్ నుంచి 'పయనీర్' అనే ఎల్పీజీ నౌక ఆదివారం కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకుంది.

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది. దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం. పేజి 2లో ▶

# ఉద్రిక్తతల వేళ..

## కీలక భేటీ నిర్వహించనున్న ప్రధాని మోదీ



●కీలక భేటీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల దృష్ట్యా ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ సీనియర్ మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు.

●ప్రధాన రంగాలు: ముఖ్యంగా పెట్రోలియం, ఎరువులు, మరియు విద్యుత్ రంగాలకు చెందిన మంత్రులతో ఈ సమీక్ష జరగనుంది.

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీ సీనియర్ మంత్రులతో కీలక భేటీ నిర్వహించనున్నారు. ముఖ్యంగా పెట్రోలియం, ఎరువులు, విద్యుత్ రంగాలకు చెందిన మంత్రులతో సమీక్ష జరపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇంధనం నిరంతరాయంగా సరఫరా చేయడం, సరకు రవాణాలో ఇబ్బందులు లేకుండా చూడటమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపాయి. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.పశ్చిమాసియాలో యుద్ధం ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీసిందని ప్రధాని మోదీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఇది భారత్‌కు ఓ కీలక పరీక్షగా మారిందని.. శాంతి, సహనంతో ఈ పరిస్థితులను ఎదుర్కోవాలని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తోందన్నారు.

## ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్..

### ఉత్తరాంధ్రకు మరో మణిహారం: కలిశెట్టి



2లో..

## లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి



2లో..

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం




●అమరావతి లక్ష్యం: గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అమరావతిని, హైదరాబాద్‌ను మించేలా అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన స్మార్ట్ సిటీగా నిర్మిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

●హైదరాబాద్ అభివృద్ధి జ్ఞాపకాలు: ఉమ్మడి ఏపీలో బిల్‌గేట్స్‌ను కలిసి మైక్రోసాఫ్ట్ ప్రతినిధులను ఒప్పించడం, ఐఎస్‌బీ , శంషాబాద్ విమానాశ్రయం, నల్సార్ మరియు ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల ఏర్పాటుకు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు.

●మౌలిక సదుపాయాలు: కేవలం 9 నెలల్లోనే కృష్ణా నది నీటిని హైదరాబాద్‌కు తీసుకురావడం మరియు జీనోమ్ వ్యాలీ ఏర్పాటు వంటి విజయాలను వివరించారు.

హైదరాబాద్: హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. వైకాపా పాలనలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. కృత్రిమ మేధ వినియోగం, విస్తరణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఏర్పాటు చేసిన సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందనీ, 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని చెప్పారు.
"ఉమ్మడి ఏపీలో ఐటీ కంపెనీలు తెచ్చేందుకు అనేకమందితో మాట్లాడా. దిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిశా. భారత్‌లో ఐటీ కంపెనీలు పెట్టాలని కోరా. లెక్కలు, ఇంగ్లీష్‌లో భారతీయులు గొప్పవాళ్లని ఆయనకు చెప్పా. హైదరాబాద్‌లో ఐటీ కార్యాలయం పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా. అప్పట్లో హైదరాబాద్ వచ్చేందుకు వాళ్లు తొలుత నిరాకరించారు. అక్కడికి వస్తే మాకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగారు. అప్పట్లో ఐఎస్‌బీ తెచ్చేందుకు ఎంతో కృషి చేశా. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చాం. అప్పట్లో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేది. కానీ, కేవలం 9 నెలల్లోనే కృష్ణానది నుంచి తాగునీరు తీసుకొచ్చాం.

## మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!



పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలోనే భవానీపూర్ నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షిస్తోంది. పేజి 2లో ▶

## పాలనలో.. మోదీ రికార్డు



# పోలవరం ఎమ్మెల్యేను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు

పోలవరం: ఏపీలోని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.12 లక్షలు కాజేశారు. ఆర్టీఏ చలానా పేరుతో వచ్చిన లింక్‌ను ఎమ్మెల్యే క్లిక్ చేశారు. దీంతో బ్యాంకు ఖాతాలోని నగదు మాయమైంది. మోసపోయినట్లు గ్రహించిన ఎమ్మెల్యే బాలరాజు.. జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



## హైదరాబాద్‌లో బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరి మృతి

పంజాగుట్ట: బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంబాగ్‌కు చెందిన దేవీదాస్ (56), అతడి అల్లుడు వరుసైన వివేక్ (32)లు ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నారు.



2లో..

# 25న కాంగ్రెస్‌కు

## రాజీనామా చేస్తా: జీవన్‌రెడ్డి

●రాజీనామా ప్రకటన: ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయబోతున్నట్లు జీవన్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు.

●మానసిక క్షోభ: గత 20 నెలలుగా పార్టీలో తీవ్రమైన మానసిక వేదనను అనుభవిస్తున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

●అవమానాలపై అసహనం: వరుసగా ఎదురవుతున్న అవమానాలను భరిస్తూ పార్టీలో కొనసాగడం ఇక తన వల్ల కాదని స్పష్టం చేశారు.

2లో..



# అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా: సీఎం రేవంత్



హైదరాబాద్: రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల కోసం రూ.9వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను నేడు విడుదల చేయనున్నట్లు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఝుత్ష్ర =వ౧౧ఎ) తెలిపారు. సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా దీనికి శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ చేశారు.
"అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా. రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా. 70 లక్షల మంది రైతన్నల కోసం రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు నేడు శ్రీకారం చుడుతున్నాం. సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా మరోసారి మా పాలనలో రైతే రాజు అని రుజువు చేస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆర్థిక సాయంతో చేతులు దులుపుకోవడం కాదు.. కేవలం 17 నెలల వ్యవధిలో పామాయిల్ పరిశ్రమ మొదలు పెట్టి, పూర్తి చేసి నేడు రైతు లోకానికి అంకితం చేస్తున్నాం. దానికి కొనసాగింపుగా రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.

# మహబూబాబాద్ పోలీసు శాఖ అడ్డుకోవడం విడ్డూరంగా ఉంది




**ఆర్టికల్ 19 బావ ప్రకటన స్వేచ అసలు ఉందా? లేదా?**

**బలిసిన లంబాడీల రాజకీయ కుట్రల పక్షమే కాంగ్రెస్ పాలన**

**అక్రమ అరెస్టు లు చేపించే లంబాడీల వెకిలి చేష్టలు తుడుందెబ్బ ఉద్యమాన్ని అపలేవు**

జన సముద్రం తాడ్వాయి ప్రతినిధి దుబాసి సుధాకర్ తుడుందెబ్బ

సమావేశాలు లంబాడీ లు చెప్తే

ఈరోజు ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ మరియు రాష్ట్ర కమిటీల తేదీ:11/03/2026 మేడారం డిక్లరేషన్ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల్లో 18 జిల్లా కమిటీలు,175 మండల కమిటీలు 2000 గ్రామ కమిటీల నిర్మాణం చేయడంలో భాగంగా తేదీ: 15 /3 / 2026న ములుగు జిల్లా కమిటీని పూర్తిచేసుకుని రెండవ దఫలో తేదీ 22/3/ 2026 న మహబూబాబాద్ జిల్లా కమిటీ నిర్మాణం చేయడంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో వీర భద్ర ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి వెళ్లే క్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మహిపతి అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి ఆదివాసి కళా సమితి రాష్ట్ర నేత యునేని మధు విద్యార్థి నేత గొంది రాకేష్ ల ను పోలీసులు మార్గం మధ్యలో అడ్డుకొని మీకు అనుమతి మీటింగ్ కి వెళ్లే అనుమతి లేదని పై నుండి ఆర్డర్ అని అడ్డుకొని పోలీస్ స్టేషన్ కి తరలించి అక్రమ అరెస్టు చేసి బైండోవర్ చేయడం జరిగిందని అన్నారు

అనంతరం అరెస్టు కాబడిన రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ జాతీయ ఉపాధ్యక్షులు పోడెం బాబు-శాఖ రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి లు మాట్లాడుతూ ఇది ప్రజాస్వామిక దేశమా? ప్రజాస్వామ్య పాలన ఈ రాష్ట్రంలో నడుస్తుందా? పాకిస్తాన్ లో ఉన్నామ? తెలంగాణలో ఉన్నామా? అర్థం కాని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. జిల్లా కమిటీ ఎన్నిక సమావేశం కేవలం 50 నుంచి 60 మందితో జరిగే సమావేశాలను కూడ జరగనివ్వకుండా లంబాడీలు కుట్రలు చేస్తుంటే ఆ కుట్రలను పసిగట్టి ప్రజాస్వామ్య హక్కులను ప్రాథమిక హక్కులను స్వేచ్ఛ హక్కులను భంగం కలగకుండ చూడాల్సిన ప్రభుత్వం మరియు ఇంటలిజెన్స్, పోలీస్ శాఖ ఏకంగా తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్ బుక్ చేసుకున్న దాన్ని కురవి పోలీస్ లు వెళ్ళి క్యాన్సల్ చేసి తుడుందెబ్బ మీటింగ్ కి ముందుగా మేము దరఖాస్తు చేసుకున్న ప్రకారం అనుమతి ఇచ్చి మళ్ళీ పోలీస్ లు పర్మిషన్ లేదని మా ప్రజాస్వామిక హక్కులను పోలీస్ శాఖ తన ఆధీనంలోకి తీసుకొని తుడుం దెబ్బ నేతలను తాడ్వాయి పోలీస్ స్టేషన్లో గూడూరు పోలీస్ స్టేషన్ లో కురవి పోలీస్ స్టేషన్ లో ఎక్కడికక్కడ నిర్బంధించడం ప్రజా స్వామ్య వ్యతిరేక చర్య అని అన్నారు. దీనిని పోలీస్ శాఖ పునర ఆలోచన చేయాలని అన్నారు. మాకు సమావేశాలు పెట్టి మా తుడుం దెబ్బ నిర్మాణాలు చేసుకునే హక్కు కూడ మీరే నిర్ణయం చేస్తే ఇక దీనికి ప్రజాస్వామ్యం అని పేరు ఎందుకని అన్నారు ఇది ప్రజా ప్రభుత్వము నా లంబాడా ప్రభుత్వము అని వీరుచుకుపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం చేతుల మీద నడుస్తుందా లేక లంబాడ రాజకీయ కుట్రలు చేసే నాయకుల చేతిలో ప్రభుత్వాలు నడుస్తున్నాయ సమాధానం చెప్పాలని అన్నారు.ఆదివాసి ప్రాంతంలో భద్రాచలంలో పక్కా రాష్ట్రము వ్యక్తి కర్ణాటక సేవాలాల్ జయంతి వేడుకలు జరుపుతుంటే ఆదివాసి సంఘాలు వ్యతిరేకించిన గాని లంబాడీల పక్షాన చేరి దగ్గర ఉండి పోలీస్ శాఖ ఉత్సవాలు జరుపుతుంది. కోయ ల ఇలవేల్పు కురవి మల్లన్న సన్నిధిలో ఆదివాసీలు సమావేశం జరుపుకుంటే ఎందుకు పోలీస్ లు భద్రత ఇవ్వలేకపోతున్నారో సమాధానం చెప్పాలి అన్నారు. మొత్తం మీద లంబాడాల ఆధిపత్యం రాష్ట్రంలో చెలరేగిపోతుందని లంబాడీల వికృత చేస్తలే ప్రజాస్వామ్య వ్యవస్థ ముందు గెలుస్తున్నాయని కనీసం మీటింగ్ పెట్టుకోలేని పరిస్థితి రాష్ట్రంలో ఉంది అంటే ఇక ఆదివాసీల రిజర్వేషన్ల దోపిడి భూముల దోపిడి విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో దోపిడి ఇంకా ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని అన్నారు

ఆదివాసి సమాజం ఇప్పటికైనా గాని మేలుకోవలసిన అవసరం ఉందని లంబాడీల తొలగింపు కు వైపు ప్రతి గూడెం కదలవలసిన అవసరం ఉందని అన్నారు రాజకీయ పార్టీల కావాల్సింది లంబాడీల ఓట్లని లంబాడీల ఓట్లు అధికంగా ఉన్నాయి కాబట్టి వారి ఆదివాసీలు అంటే చులకన అని అన్నారు అన్నింటికీ లెక్కలు తేలుస్తామని లెక్కలు తేల్చడానికే రాష్ట్రవ్యాప్త తుడుం దెబ్బ ఉద్యమ నిర్మాణం జరుగుతుందని నేతలు పేర్కొన్నారు వికృత చేష్టలు వెకిలి నవ్వులు లంబాడ దురహంకారం అన్నిటికీ ఫుల్ స్టాప్ పెట్టే రోజు త్వరలో తుడుం దెబ్బ చూపిస్తుందని అన్నారు అతి త్వరలో మహబూబాబాద్ జిల్లా కమిటీ తేదీని మళ్లీ ప్రకటించనున్నట్లు రాష్ట్ర కమిటీ పేర్కొందిఇప్పటికే లంబాడీలు ఎస్టీ లు అని సుప్రీం కోర్టు కి నోటీసులు పంపుతూ 1900 సంవత్సరం నుండే లంబాడీలు ఎస్టీ లు అని ఆదివాసి స్పెషల్ లీవ్ పిటిషన్ కొట్టిపారేయాలని రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచి తన నిజ స్వరూపం ఏంటో బయట పెట్టింది అన్నారు రాజకీయ పార్టీ లు అన్ని జై సేవలాల్ అంటూ లంబాడీ ఊడిగం చేస్తున్న సందర్భం లో ఆదివాసీలు తన నెల ను నమ్ముకొని యుద్ధం కి సిద్ధం అవ్వాలని పిలుపునీచారు దీనిలో ఆదివాసి కళా సమితి నేతలు యునేని మధు విద్యార్థి నేత గొంది రాకేష్ లు ఉన్నారు

# పాలనలో.. మోదీ రికార్డు

మొదటిపేజీ తరువాయి

తన రాజకీయ జీవితంలో ప్రధాని మోదీ (గ్రావీ చీుతీవఅుతీఞ వీశీఎఱ) మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. 8,931 రోజుల పాటు (గుజరాత్ సీఎం పదవీకాలం సహా) ఎలాంటి విరామం లేకుండా దేశంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ అధిపతిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటి వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న ఈ రికార్డును మోదీ అధిగమించారు. చామ్లింగ్ సిక్కిం ప్రభుత్వ అధిపతి (ముఖ్యమంత్రి)గా 8,930 రోజులు పనిచేశారు.

2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధానమంత్రి అయ్యే వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు.

గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా మోదీ నిలిచారు. అంతే కాకుండా ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవమున్న ప్రధాని కూడా ఆయనే.

స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేత కూడా మోదీయే. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకొని, మూడోసారి అధికారం చేపట్టిన కాంగ్రెసేతర పార్టీ నేతగా రికార్డు నెలకొల్పారు.

వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీని మోదీ విజయపథంలో నడిపించారు. దీంతో మూడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని సాధించిన నెహ్రూ రికార్డును సమం చేశారు.

గతేడాది జులైలో మోదీ.. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి వరుసగా దేశంలో అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా నిలిచారు.

వరుసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీ పక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్రమోదీ. 2002, 2007, 2012లలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎం అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారు.

# లారీని ఢీకొట్టిన కారు.. భార్యాభర్తలు మృతి

మొదటిపేజీ తరువాయి

పూతలపట్టు: చిత్తూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. చిత్తూరు-తిరుపతి హైవేపై ఆదివారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ముందువెళు తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో కారులోని భార్యాభర్తలు సతీశ్, భాగ్యలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. అదే కారులో ప్రయాణిస్తున్న కుమారుడు సుశాంత్, కుమార్తె పావని, డ్రైవర్ ప్రదీప్ సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటకలోని మండ్యకు చెందిన వీరంతా తిరుమలకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## శత్రు నౌకలు మినహా అన్నీ వెళ్లొచ్చు! - ఇరాన్



హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందేనని, లేదంటే విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ స్పందించింది. శత్రు దేశాలకు చెందినవి మినహా అన్ని నౌకలు తమతో సమన్వయం చేసుకుంటూ హర్మూజ్ ద్వారా వెళ్లొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఐరాసలోని ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాన్ని వెల్లడించారు.

హర్మూజ్‌లో ప్రస్తుత పరిస్థితికి అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రధాన కారణమని మౌసావి ఆరోపించారు. దౌత్యానికి ఇరాన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అయినప్పటికీ.. దురాక్రమణ నిలిపివేయడం, పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమన్నారు. నావికుల రక్షణ, సముద్ర భద్రతను మెరుగుపరచడానికి ఐరాస విభాగమైన ఐఎంవోకు సహకరించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇదిలాఉంటే, హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకుంటే.. ఇరాన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. అతిపెద్ద విద్యుత్ కేంద్రంతోనే ఈ దాడులు ఆరంభిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.

## వార్ ఎఫెక్ట్.. కెన్యా తీరంలో చిక్కుకుపోయిన వేలాది లగ్జరీ కార్లు



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తున్న ఇరాన్.. హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపైనా ఆంక్షలు కొనసాగిస్తోంది. దీంతో.. అనేక ఇంధన, సరకు రవాణా నౌకలు నిలిచిపోతున్నాయి. ఈ క్రమంలోనే జపాన్ నుంచి దుబాయ్‌కు చేరాల్సిన వేలాది లగ్జరీ కార్లు కెన్యా తీరంలో చిక్కుకుపోయాయి. ఇప్పటికే దాదాపు నాలుగు వేల కార్లు ఇక్కడ చిక్కుకుపోగా.. వచ్చే వారం మరో ఐదు వేల వాహనాలు రానున్నాయి.

పోర్షే సహా ఆయా కంపెనీల లగ్జరీ కార్ల లోడ్‌తో జపాన్‌లోని యోకోహామా నుంచి గత నెలలో నౌకలు బయల్దేరాయి. దుబాయ్‌లోని జాబెల్ అలీ పోర్ట్‌లో వాటిని డెలివరీ చేయాల్సి ఉంది. అయితే, అంతలోనే యుద్ధం మొదలైంది. మార్చి 1న జాబెల్ అలీ పోర్ట్‌పైనా దాడులు జరిగాయి. దీంతో 4,000 కార్లతో అక్కడికి వెళ్లాల్సిన ఓ నౌకను కెన్యాలోని లాము పోర్ట్‌కు మళ్లించారు. ఇక్కడి గిడ్డంగుల్లో ఆ కార్లను పార్క్ చేశారు. వచ్చే వారం మరో 5,000 వాహనాలతో కూడిన నౌక రానున్నట్లు నౌకాశ్రయ అధికారులు తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునేవరకు ఈ కార్లను ఇక్కడే ఉంచనున్నట్లు చెప్పారు.

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ ఎలా ఉందో చూస్తున్నాం. విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులు వరకు తీసుకొచ్చాం. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీరంగంలో దక్షిణాదిలో మేమే నెంబర్‌వన్ ” అని చంద్రబాబు అన్నారు.

## ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్.. ఉత్తరాంధ్రకు మరో మణిహారం: కలిశెట్టి

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఉత్తరాంధ్రలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రూ.1.05 లక్షల కోట్లతో ఏర్పాటు కాబోతున్న ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయబోతున్నట్లు చెప్పారు. ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలుస్తుందన్నారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేశారని, సీఎం చంద్రబాబు 20 నెలల్లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపించారని చెప్పారు. ఉత్తరాంధ్ర ద్రోహిగా జగన్ నిలిచిపోయారని విమర్శించారు.

# 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా: జీవన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

జగిత్యాల: కాంగ్రెస్‌లో కొనసాగలేనంటూ జగిత్యాల కార్యకర్తలకు సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని అందులో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నానని తెలిపారు. అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేనని చెప్పారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. ‘నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి’ అని కార్యకర్తలను కోరారు.


## హైదరాబాద్‌లో బాల్కనీ స్లాబ్ కూలి ఇద్దరి మృతి

మొదటిపేజీ తరువాయి

కుందన్ బాగ్ మెథడిస్ట్ కాలనీలోని శ్రీవాత్స అపార్ట్‌మెంట్ యజమాని ద్వారకాప్రసాద్ పనుల నిమిత్తం వారిని తన ఇంటికి పిలిపించాడు. ముగ్గురూ కలిసి మూడో అంతస్తుకు చేరుకొని పనుల గురించి మాట్లాడుతుండగా.. ఒక్కసారిగా బాల్కనీ స్లాబ్ కూలిపోయింది. దీంతో ముగ్గురూ కింద పడిపోయారు. దేవీదాస్, వివేక్ అక్కడికక్కడే మృతిచెందారు. ఇంటి యజమాని ద్వారకా ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!

మొదటిపేజీ తరువాయి



కారణం.. ఇది ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం కావడమే. పైగా ఈసారి భాజపా నేత సువేందు అధికారి సైతం ఇక్కడినుంచే పోటీకి దిగనున్నారు. ప్రస్తుతం దీదీకి కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా. స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు ఇక్కడ హస్తం పార్టీ నేతలదే పైచేయి.

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే.. భవానీపుర్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానూ ఆయన విజయం సాధించడం గమనార్హం. మీరాదత్తా గుప్తా, రథిన్ తాలుక్‌దార్ వంటి కాంగ్రెస్ దిగ్గజాలు కూడా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు.

అనేక సంవత్సరాలపాటు కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగిన ఈ నియోజకవర్గం పేరును కాళీఘాట్‌గా మార్చారు. 1969 ఎన్నికల్లో సీపీఎం నేత సాధన్ గుప్తా గెలుపొందారు.

1972లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం.. ఈ నియోజకవర్గం కనుమరుగైపోయింది. మళ్లీ 2011లో డీలిమిటేషన్ తర్వాత భవానీపుర్ పేరిట పునర్వ్యవస్థీకరించారు. అదే ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లోనే బెంగాల్‌లో వామపక్షాల సుదీర్ఘ పాలనకు తెరదించుతూ టీఎంసీ అధికారంలోకి వచ్చింది. భవానీపుర్‌లో దీదీ విశ్వాసపాత్రుడు సుబ్రతా బక్షీ గెలుపొందారు

కొద్దికాలానికే బక్షీ ఆ సీటును ఖాళీ చేశారు. అప్పటికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మమతా బెనర్జీ.. ఇదే స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటినుంచి ఈ సీటు తృణమూల్ చేతుల్లోనే ఉంది. 2016లోనూ మమత 65 వేలకుపైగా ఓట్లతో విజయం సాధించారు.

పాలనలో.. మోదీ రికార్డు

2021లో నందిగ్రామ్ నుంచి పోటీ చేసిన మమత.. సువేందు అధికారి చేతిలో 1,956 ఓట్ల తేడాతో ఓడిపోయారు. భవానీపుర్‌లో మాత్రం టీఎంసీ అభ్యర్థి సోవందేబ్ ఛటోపాధ్యాయ విజయం సాధించారు. ఆయన రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో 58 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో మమతా విజయం సాధించారు.

దక్షిణ కోల్‌కతాలోని ఈ అసెంబ్లీ నియోజకవర్గం సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఇక్కడ బెంగాలీ మధ్యతరగతి కుటుంబాలతోపాటు పెద్ద సంఖ్యలో హిందీ మాట్లాడే వ్యాపార వర్గాలూ ఉన్నాయి. ఓటర్లలో బెంగాలీ హిందువులు దాదాపు 42 శాతం, బెంగాలీయేతర హిందువులు 34 శాతం, ముస్లింలు 24 శాతం ఉన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగత రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నారని, స్థానిక సామాజిక వాతావరణం ఆమెకు అనుకూలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది,

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి,


**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి సిరిపురం మధుకర్ మార్చి 22, 2026:**





ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, అన్నారు. ఆదివారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 200 కోట్ల రూపాయల అంచనా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 8, 9 వార్డులలో 13 లక్షల రూపాయలతో సి సి రహదారి నిర్మించడం జరిగిందని, శ్రీనివాస గార్డెన్ నుండి అమ్మ గార్డెన్ వరకు 1 కోటి 80 లక్షల రూపాయలతో హైమాస్ లైట్ల ఏర్పాటు కొరకు శంకుస్థాపన చేయడం జరిగిందని, 30 రోజులలో నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా మందమర్రి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలు, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 40 కోట్ల రూపాయలు, చెన్నూర్ మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో 51 లక్షల రూపాయల నిధులతో సిసి రహదారులు నిర్మించి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా 32 కోట్ల రూపాయల వ్యయంతో క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో రహదారులు, మురుగు కాలువలు, లైటింగ్, త్రాగునీటి పనులు చేపట్టడం జరుగుతుందని, ఇంటర్నల్ పైప్ లైన్ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడం జరుగుతుందని, మున్సిపల్ పరిధిలోని ఒక్కొక్క వార్డులో దాదాపు 2 కోట్ల రూపాయల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి, చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీలలోని అన్ని వార్డులలో అమృత్ పథకం క్రింద త్రాగునీటిని అందించడం జరుగుతుందని, డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో 24 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన సిసి రహదారి ప్రారంభించడం జరిగిందని, 60 లక్షల రూపాయల టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో 40 హైమాస్ లైట్లను పట్టణంలో ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయని, అమృత్ పథకం పనులను 6 నెలలలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులకు ఇబ్బందులు లేకుండా స్మశాన వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద 2 కోట్ల 9 లక్షల రూపాయలతో చెరువు సుందరీకరణ పనులు చేపడుతున్నామని, 3 నెలలలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యాతనపల్లిలో పర్యాటక రంగ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామని, ఓపెన్ జిమ్, కుర్మపల్లి శివారులో రైలింగ్, చే లింక్, ఫెన్సింగ్, బోటింగ్ ఇతర అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేసే విధంగా అధికారుల సమన్వయంతో పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లను ప్రారంభించడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం బోర్ వెల్స్, హైమాస్ లైట్లు ఏర్పాటు దిశగా కృషి చేస్తామని తెలిపారు. సి సి రోడ్డు, 2 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం కింద చర్యలు తీసుకోవడంతో పాటు ఊరు మందమర్రిలో ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు 2 కోట్ల 31 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో సి సి రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి చర్యలలో భాగంగా డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగించి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 30 కోట్ల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టి 20 శాతం పూర్తి చేయబడి మిగతా పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా సోలార్ హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లు తగ్గించడంతోపాటు ప్రజలకు ఉపయోగకరమైన వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా 21 సోలార్ హైమాస్ లైట్లు మంజూరు చేయబడి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటి కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని పెంపొందించి నీటి లభ్యత గా కృషి చేస్తున్నామని తెలిపారు. సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## :శ్రీ వేంకటేశ్వరునికి దర్శనానికి పోటెత్తిన భక్తులు...





**జనసముద్రం న్యూస్ గుడివాడ ప్రతినిధి. సుబ్రహ్మణ్యం. మార్చ్. 22.**

మండలంలోని డోకిపర్రు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో విచ్చేసిన భక్తులతో స్వామివారి సన్నిధిలో తాకిడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వేలాది మందికి అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ధర్మకర్తలు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థికసాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

## అన్ని పనులు పూర్తయిన ఓపెనింగ్ కు నోచుకోని వాటర్ ట్యాంక్

**తూర్పుగోదావరి/సీతానగరం/మార్చి 22/జనసముద్రం న్యూస్ :**



సీతానగరం మండలంలోని ఇనుగంటివారిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారింది. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా, నేటికీ దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విద్యుత్ సరఫరా లేదని, నీటి పరీక్షలు జరగాలని కాలయాపన చేసిన అధికారులు, అవి పూర్తయినప్పటికీ ట్యాంకును ప్రారంభించడం లేదు. ట్యాంక్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతో, బయట వ్యక్తులు బట్టలు ఆరవేసుకునే స్థావరంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పంచాయతీ అధికారులు బేఖాతరు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు అపరిశుభ్రంగా, బురదగా వస్తోందని, ఈ కొత్త ట్యాంక్ అందుబాటులోకి వస్తే పైపులు శుభ్రపడి మంచి నీరు అందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఫినిషింగ్ పనులు పూర్తి చేసి వాటర్ ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి ...







- కేసు పెట్టిన కుటుంబంపై దాడి, తల్లి ఆత్మహత్యాయత్నం....

**జనసముద్రం న్యూస్, మదనపల్లి, 22 మార్చి :-**

అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం గూడుపల్లి గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బాధితుల సమాచారం మేరకు, కనకంటి వారిపల్లికి చెందిన కిట్ట భార్య భవాని (30) తన (10) సం కుమార్తె పై అదే గ్రామానికి చెందిన ప్రతాప్ లైంగిక దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయితే కేసు పెట్టినందుకు ఆగ్రహించిన నిందితుడి కుటుంబ సభ్యులు ప్రతాప్, శంకర, కవిత, చిన్న పార్వతమ్మ, సుబ్బమ్మ, పెద్దరెడ్డి, చిన్నరెడ్డి, జయమ్మ, నరసింహులు, నాగలక్ష్మి, రెడ్డెప్ప కలిసి బాధిత కుటుంబంపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలతో తీవ్ర మనస్థాపానికి గురైన భవాని విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక ఈ కేసులో నిందితులకు ములకలచెరువు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. తన కుమార్తెకు న్యాయం చేయాలని భవాని ఆసుపత్రిలో కన్నీటి వేడుకోలు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

## గేదెలను దొంగలించిన నలుగురు దొంగలు అరెస్ట్.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా మార్చి 22 ద్వారకాతిరుమల.**



ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు డిఎస్పి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. కృష్ణ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్సై టి సుధీర్ వారి సిబ్బంది సహాయంతో సి సి ఫుటేజ్ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గత నెల ఫిబ్రవరి 26 రాత్రి సమయంలో ద్వారకా తిరుమల మండలం పాములవారిగూడెంలో కొబ్బరి తోటలో గేదెల షెడ్డు వద్ద రెండు గేదులు, ఒక లేగదూడను దొంగలించారు. తిరుమల పాలెం గ్రామానికి చెందిన బోడ శ్రీరాములు ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేశారు. కేసును సవాల్గా తీసుకున్న పోలీసులు గేదెలను దొంగలించిన నలుగురు ముద్దాయిలను ఆదివారం ఉదయం అరెస్టు చేశారు. నలుగురు ముద్దాయిలు చెడు వ్యసనాలకు అలవాటు పడి గేదెలను దొంగలించారని విచారణలో తెలిపారు.

ముద్దాయిలు A1 ద్వారకా తిరుమల మండలం తిరుమలంపాలెం చెందిన మిడతా వెంకన్న తండ్రి నారాయణ ,

A 2. నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామం కడారి కృష్ణ తండ్రి పోతురాజు,

A3. నల్లజర్ల మండలం అయ్యవరం గ్రామం కడారి సురేష్ తండ్రి కృష్ణ,


A 4. గోపాలపురం మండలం చిట్యాల గ్రామం ఉప్పాటి సుబ్రహ్మణ్యం తండ్రి అబ్బులు నలుగురిని అరెస్టు చేశారు.

కేసు దర్యాప్తులో సహకరించిన పోలీస్ సిబ్బంది .సిహెచ్ .లక్ష్మీనారాయణ, ఎన్ శివ కృష్ణ, ఎం నాగార్జున, వి జయ ప్రకాష్ బాబు.

## 9వ వార్డులో పీపుల్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో నూతన బోర్ల ఏర్పాటుకు భూమి పూజ

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జనసముద్రంన్యూస్, మాచర్ల, మార్చి 22;**






పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని 9వ వార్డు లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్థానిక ప్రజలతో కలిసి సమస్యలపై చర్చించి, పరిష్కారం దిశగా అడుగులు వేయటం జరిగింది. పీపుల్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో నూతన బోర్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమి పూజ చేశారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మున్సిపల్ కమీషనర్ వేణుబాబు, పలువురు అధికారులు, కూటమిపార్టీ నాయకులు, కార్యకర్తలు, 9వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.


## వరికెపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని..


## వెల్దుర్తి మండల రైతుల, ప్రజల ఐక్య నిరాహార దీక్ష

**జనసముద్రంన్యూస్, వెల్దుర్తి మండలం, మార్చి 22;**









వరికిపూడి శాల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టా లని కోరుతూ ఆదివారం వెల్దుర్తి మండలంలోని రైతులు, ప్రజలు ఒకరోజు ఐక్య నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు జీవో నెంబర్ 14 ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వరికెపూడిశెల ప్రాజెక్టు సాధన సమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలం లోని రైతులు, ప్రజలు వారి సొంత గృహాల్లోనే నిరాహార దీక్ష చేపట్టారు.

# "కష్టాల నుంచి కళా శిఖరాల వరకు" ----

# రమేష్ కు స్వర్ణ నంది ఘనత ....

- జానపద కళల పరిరక్షణలో విశేష సేవలు -- ఘనంగా సన్మానించిన ప్రముఖులు.

**జనసముద్రం న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్:**
అశ్వాపురం మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన ప్రముఖ కోలాట మాస్టర్, కవి, గాయకుడు మరియు ఐటీసీ ఉద్యోగి తోకల రమేష్ కు ఉగాది సందర్భంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక స్వర్ణ నంది పురస్కారాల వేడుకలో "స్వర్ణ నంది ఉగాది పురస్కారం" అందుకున్నారు.

ఖమ్మంలోని రాములవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న రామగిరి ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన అతిథులు ఆయనను ఆదివారం ఘనంగా సత్కరించారు. శాలువాతో సన్మానించి, స్వర్ణ నంది జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ స్వయంకృషితో ఎదిగిన రమేష్ , తన రచనలు మరియు జానపద కోలాటం ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఐటీసీ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూ సామాజిక సేవల్లో కూడా ముందుంటూ, గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ కొత్త తరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర



పోషిస్తున్నారని కొనియాడారు. అవార్డు స్వీకరించిన అనంతరం తోకల రమేష్ మాట్లాడుతూ,

ఈ అవార్డు నా గురువులు ---- నా గ్రామానికి అంకితం. అవార్డు గ్రహీత------ తోకల రమేష్...

ఈ గౌరవాన్ని తన గురువులకు మరియు ఐటీసీ సంస్థకు అంకితం చేస్తున్నానని తెలిపారు. తన గ్రామం, కుటుంబ సభ్యులు, స్నేహితులు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కళా, సాహిత్య, సామాజిక సేవా రంగాల్లో మరింత సేవ చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

ఈ అవార్డు అందుకోవడంతో రమేష్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్తులు, తోటి ఉద్యోగులు ఆకాంక్షించారు.



పాల్గొన్నవారు-----

ఈ కార్యక్రమంలో ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురవిళ్ల ప్రవీణ్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ పాలకుర్తి కృష్ణ, కన్వీనర్ ప్రముఖ కమెడియన్ మొగిలి గుణకర్, కో కన్వీనర్ సినీ నటుడు నాగ సాయి, డైరెక్టర్ రవి తోప్, గాయకుడు కోదాడ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తిలో ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు --

## వాహనదారులకు అప్రమత్తత సూచనలు

- బోర్డులను ఏర్పాటు చేసిన సీఐ పులి రమేష్, ఎస్ఐ ఏ ప్రవీణ్ కుమార్

**ఎల్కతుర్తి, మార్చి 22(జనసముద్రం)**
ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో రహదారులపై తరచుగా జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు కీలక చర్యలు చేపట్టారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ పులి రమేష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఆదివారం రోజు ఎల్కతుర్తి నుండి కరీంనగర్ రూట్, సిద్దిపేట రూట్, హన్మకొండ రూట్‌లలోని ప్రధాన రహదారులపై, అలాగే ఎల్కతుర్తి సెంటర్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వాహనదారులు రోడ్డు భద్రతా




నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వేగ పరిమితులను గౌరవించడం, మద్యం సేవించి వాహనం




నడపకూడదని, అలాగే వాహనాలకు సంబంధించిన అవసరమైన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది అఖిల్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు చేపట్టిన ఈ చర్యలకు స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ

**వెల్దండ, మార్చి, 23(జనసముద్రం న్యూస్)**
మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఆదివారం రోజు నూతన సిసి రోడ్డు పనులను ఆ గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు, అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందు వరుసలో నిలబెట్టాలని సంకల్పంతో ఆమె తాజాగా భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు, ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధులలో రాబోయే రోజులలో సీసీ రోడ్ల నిర్మించేలా



శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు, గ్రామంలో డ్రైనేజ్, వీధి దీపాలు, పరిశుభ్రత, రోడ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు, గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు, ప్రతి పౌరుడు బాధ్యతయుతంగా నడుచుకున్నప్పుడే మంచి సమాజ నిర్మాణం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్ చారి, వార్డు మెంబర్లు గంగపురం రమేష్, నిరంజన్, మమత అనిల్ కుమార్, తిరుపతి నాయక్, తక్కెళ్ళపల్లి లలిత మల్లయ్య, రజిని జానీ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ వర్సెస్ పాత్రికేయుల స్నేహ పూర్వక క్రికెట్ పోటీ

- యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు
- క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

**చొప్పదండి (జనసముద్రం న్యూస్):**
యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడిచి బావి భారత పౌరులు ఎదగాలని చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సై నరేష్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో చొప్పదండి పోలీస్ వర్సెస్ పాత్రికేయుల స్నేహపూర్వక క్రికెట్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పాత్రికేయులు గెలుపొందారు. గెలుపొందిన పాత్రికేయుల టీంకు కు సిఐ ప్రదీప్ కుమార్,



ఎస్ఐ నరేష్ రెడ్డిలు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలపై దృష్టి పెట్టి క్రీడలలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో మానసిక ప్రశాంత కలుగుతుందని విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసులు, పాత్రికేయులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంత పొందుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ లను పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయకులు, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వల్బాపూర్ గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్‌కు ఘన సన్మానం






**ఎల్కతుర్తి మార్చి 22(జనసముద్రం)**
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికైన శ్వేత శ్రీనివాస్‌కు ఆదివారం వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఘన సన్మాన మహోత్సవం నిర్వహించారు. గ్రామ ప్రజల విశ్వాసాన్ని పొందుతూ సర్పంచ్‌గా ఎన్నిక కావడం గర్వకారణమని సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్వేత శ్రీనివాస్‌కు పూలమాలలు వేసి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ భివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె ఉత్తమ సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు. యువతీ నాయకురాలిగా గ్రామానికి మంచి సేవలు అందించి ఆదర్శ సర్పంచ్‌గా నిలవాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నడిపెల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కాకులమర్రి ప్రవీణ్ కుమార్, కోశాధికారి సిద్ధూరి స్వామి రావు, వెలమ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. చివరిగా శ్వేత శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సహకారంతో వల్బాపూర్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు.

# వేటగాళ్ల ఉచ్చులో పడి వ్యక్తి బలి

**జనసముద్రం న్యూస్, మదనపల్లి, గుర్రంకొండ, మార్చి 22:-**
మండలంలో అమానుష ఘటన శనివారం అర్ధ రాత్రి జరిగింది. తరిగొండ పంచాయతీ, ప్యారంపల్లి ఫారెస్ట్ బీట్ లో వేటగాళ్లు తీసిన ఉచ్చులో పడి వాల్మీకిపురం మండలం, ప్యారంపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం యాదవ్(46) మృత్యువాత పడ్డాడు. అడవి జంతువులను వేటడానికివెళ్లి, అడవి జంతువులకు కరెంటు తీయడంతో, ఆ ఉచ్చులోచిక్కి సుబ్రహ్మణ్యం యాదవ్ అక్కడి కక్కడే దుర్మరణం చెందాడు. వేటగాళ్లు నేరాన్ని తారుమారు చేసేందుకు మృతదేహం ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి తరలించి సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో పడేసి అనుమానం రాకుండా కుయ్యేత్తులు పన్నినట్లు సమాచారం.. పూర్తి వివరాలు పోలీసుల



దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

## ఘనంగా మావుళ్ళమ్మ అమ్మవారి అన్న సమారాధన

**తూర్పుగోదావరి/ సీతానగరం/ మార్చి 22/ జనసముద్రం న్యూస్ :**
సీతానగరం గ్రామ దేవత శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ముగించుకుని ఆదివారం ఘనంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండ్రపు ముత్యాలు మాట్లాడుతూ ఇటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా జాతర మహోత్సవం నిర్వహించడం జరిగిందని, సుమారు పదివేల మందికి ఈ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పెందుర్తి అచ్చయ్య, వలవల రాజా, తదితరులు పాల్గొన్నారు.



## కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తో భేటీ అయిన ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు

**జనసముద్రంన్యూస్, మార్చి 22;**
ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ సభ్యులు జాతీయ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తో ఆదివారం హైదరాబాద్ లో భేటీ అయ్యి పలు విషయాలపై చర్చించి వినతి పత్రం అందజేయడం జరిగింది.



## పిడబ్ల్యుడి వర్కర్స్ అండ్ కెనాన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కేంద్ర కమిటీ సమావేశం

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, నర్సరావుపేట, మార్చి 22;**
పిడబ్ల్యూ డి వర్కర్స్అండ్ కెనాన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నర్సరావుపేట పట్టణంలో కేంద్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటియుసి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసారాంబాబు మరియు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శాసేయ్య, ఉప్పలపాటి రంగయ్య పలువురు సభ్యులు పాల్గొని ప్రసంగించారు.



# మొత్తం మనోళ్లే..

## తొలిసారి ఐపీఎల్‌లో అందరూ భారత కెప్టెన్లే



పేరుకు ఇండియన్ ప్రిమియర్ లీగ్ అంటాం కానీ.. అందులో విదేశీ ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తుది జట్టులో ఉండేది నలుగురే అయినా.. విదేశీ క్రికెటర్ల ప్రభావం ఎక్కువే. కెప్టెన్లుగా పలు జట్లను వాళ్లు నడిపించారు కూడా. కానీ 18 సీజన్ల నుంచి ఉన్న ఒరవడికి ఈసారి మాత్రం తెరపడింది. లీగ్‌లో పది జట్లకూ భారత ఆటగాళ్లే సారథ్యం వహించబోతున్నారు. తొలిసారి ఐపీఎల్‌లో ఈ చిత్రాన్ని చూడబోతున్నాం. మరి కెప్టెన్లుగా ఈ పది మంది క్రికెటర్ల చరిత్రేంటి.. ఈసారి వారిపై ఉన్న అంచనాలేంటి.. ఓసారి చూద్దాం పదండి.

2008లో ఎనిమిది జట్లతో ఐపీఎల్ ఆరంభమైనపుడు ఏడు జట్లను భారత ఆటగాళ్లే నడిపించారు కానీ.. రాజస్థాన్ రాయల్స్ మాత్రం షేన్ వార్న్ సారథ్యంలో బరిలోకి దిగింది. ఈ దివంగత, దిగ్గజ ఆటగాడి సారథ్యంలో రాయల్స్ కప్పు కూడా గెలిచి ఆశ్చర్యపరిచింది. ఆ సీజన్ మధ్యలో డెక్కన్ ఛార్జర్స్ సారథ్యాన్ని వీవీఎస్ లక్ష్మణ్ నుంచి ఆడమ్ గిల్‌క్రిస్ట్ అందుకున్నాడు. తర్వాతి 17 సీజన్లలో విదేశీ కెప్టెన్ లేకుండా ఐపీఎల్ ఎప్పుడూ లేదు. షేన్ వార్న్, షేన్ వాట్సన్‌ల తర్వాత రాజస్థాన్ రాయల్స్ భారత కెప్టెన్ల వైపు మళ్లింది. కానీ డెక్కన్ ఛార్జర్స్ వారసత్వాన్ని కొనసాగిస్తూ.. తర్వాత హైదరాబాద్ ఫ్రాంఛైజీని దక్కించుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ సైతం విదేశీ కెప్టెన్లకే ప్రాధాన్యమిచ్చింది. సంగక్కర, కామెరూన్ వైట్, డారెన్ సామి, డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్సన్, మార్‌క్రమ్ జట్టును నడిపించారు. తర్వాత ప్యాట్ కమిన్స్ పగ్గాలు అందుకున్నాడు. గత రెండు సీజన్లలో ఐపీఎల్‌లో ఉన్న ఏకైక విదేశీ కెప్టెన్ కమిన్సే. కానీ ఈసారి గాయం వల్ల అతను ఐపీఎల్ ఆడడంపై అనిశ్చితి నెలకొంది. అతను వచ్చే వరకు తాత్కాలిక సారథిగా ఇషాన్ కిషన్ వ్యవహరించబోతున్నాడు. దీంతో ఈసారి ఐపీఎల్‌లో అందరూ భారత కెప్టెన్లనే చూడబోతున్నాం.

## పాండ్య ఏం చేస్తాడో?



నాలుగేళ్ల ముందు లీగ్‌లోకి అడుగు పెట్టిన తొలి సీజన్లోనే టైటిల్ సాధించి ఔరా అనిపించింది గుజరాత్ టైటాన్స్. అప్పుడు ఆ జట్టును నడిపించింది హార్దిక్ పాండ్య. తర్వాతి సీజన్లోనూ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఆ జట్టుతోనే ఉంటే హార్దిక్ కెప్టెన్‌గా ఇంకా గొప్ప పేరు సంపాదించేవాడేమో. కానీ తన పాత ఫ్రాంఛైజీ ముంబయి ఇండియన్స్ నుంచి పిలుపు వచ్చిందని అక్కడికి వచ్చేశాడు. రోహిత్ శర్మను తప్పించి సారథ్యం అప్పగిస్తే సంతోషంగా స్వీకరించాడు. కానీ అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్న హార్దిక్.. తన నిర్ణయానికి చాలా చింతించే పరిస్థితి తెచ్చుకున్నాడు. 2024 సీజన్‌లో ముంబయి ఎక్కడ మ్యాచ్ ఆడినా.. హార్దిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు తప్పలేదు. ఆ జట్టు ప్రదర్శన కూడా అందుకు తగ్గట్లే సాగింది. అయితే గత ఏడాది పరిస్థితి మారింది. ముంబయి ఆట మారింది. హార్దిక్‌పైనా వ్యతిరేకత తగ్గింది. ఇప్పటిదాకా ఐపీఎల్‌లో అతను 60 మ్యాచ్‌ల్లో నాయకత్వం వహిస్తే.. 35 విజయాలు సాధించాడు. 25 మ్యాచ్‌లు ఓడాడు. ఈసారి ముంబయి మెరుగ్గా కనిపిస్తుండడంతో హార్దిక్ నాయకత్వంలో మంచి ఫలితాలు రాబట్టగలదనే అంచనాలున్నాయి.

## ఇషాన్ వచ్చాడు..

సన్‌రైజర్స్ తాత్కాలిక సారథిగా ఇషాన్‌ను నియమించడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసి ఉండొచ్చు. ఎందుకంటే ఓపెనర్ అభిషేక్ శర్మను గతంలోనే కెప్టెన్‌ను చేస్తారని వార్తలు వచ్చాయి. అతను జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. అయినా ఇషాన్‌నే ఎంచుకుంది యాజమాన్యం. ఇందుకు ప్రధాన కారణం.. ఈ సీజన్ ముస్తాక్ అలీ టోర్నీలో అతడి ప్రదర్శనే. పెద్దగా అంచనాల్లేని ఝార్ఖండ్ జట్టు టైటిల్ గెలిచిందంటే అందుకు ప్రధాన కారణం ఇషానే. బ్యాటర్‌గా ముందుండి నడిపిస్తూ, స్ఫూర్తిమంతమైన సారథ్యంతో జట్టును ఆ టోర్నీలో విజేతగా నిలిపాడు. తర్వాత టీ20 ప్రపంచకప్‌లోనూ బ్యాటర్‌గా అదరగొట్టడంతో సన్‌రైజర్స్‌కు అతడిపై గురి కుదిరి సారథ్య బాధ్యతలు అప్పగించింది. 27 ఏళ్ల ఇషాన్.. ఐపీఎల్‌లో తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు. కమిన్స్ కోలుకోకుంటే.. సీజన్ మొత్తం అతనే జట్టును నడిపించడం లాంఛనమే.



## శుభ్‌మన్ గిల్‌కు పరీక్ష..

ప్రస్తుతం టీమ్‌ఇండియాకు టెస్టులు, వన్డేల్లో సారథ్యం వహిస్తున్న శుభ్‌మన్.. రెండేళ్లుగా గుజరాత్ జట్టును నడిపిస్తున్నాడు. భారత కెప్టెన్ కావడానికి ఇక్కడ చూపించిన నైపుణ్యాలే కారణం. తన సారథ్యంలో 2024లో జీటీ అంత బాగా ఏమీ ఆడలేదు కానీ.. నిరుడు మెరుగైన ప్రదర్శనతో ప్లేఆఫ్స్‌కు వెళ్లింది. కెప్టెన్‌గా 27 మ్యాచ్‌ల్లో అతను 14 విజయాలందుకున్నాడు. 13 ఓటములు తన ఖాతాలో ఉన్నాయి. బ్యాటర్‌గా సహచరులకు స్ఫూర్తినిచ్చేలా తన ఆట ఉంటుంది. ఈసారి కెప్టెన్‌గా ఇంకా బలమైన ముద్ర వేయాలని అతను చూస్తున్నాడు.

## గొప్ప కెప్టెన్‌గా..

కెప్టెన్‌గా దిల్లీ క్యాపిటల్స్ ప్రదర్శనను మెరుగుపరిచి, ఆపై కోల్‌కతాకు చాలా ఏళ్ల తర్వాత కప్పు అందించి కెప్టెన్‌గా తనేంటో చాటి చెప్పాడు శ్రేయస్ అయ్యర్. నిరుడు అతను పంజాబ్ కింగ్స్‌కు మారితే.. చాలా ఏళ్లుగా అట్టడుగున ఉంటున్న జట్టు కాస్తా ఏకంగా ఫైనల్‌కు చేరడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. శ్రేయస్ గొప్ప కెప్టెన్ అని మరోసారి రుజువైంది. ఈసారి పంజాబ్ కప్పు కలను నెరవేర్చాలని చూస్తున్నాడు శ్రేయస్.


## తొలిసారే కప్ సాధించి..

ప్రతిసారీ భారీ అంచనాలతో బరిలోకి దిగడం.. కప్పు లేకుండానే వెనుదిరగడం.. 17 సీజన్ల పాటు బెంగళూరు పరిస్థితి ఇదే. కానీ నిరుడు కెప్టెన్ అయిన తొలి సీజన్లోనే ఆ జట్టుకు ట్రోఫీ అందించి చరిత్ర సృష్టించాడు రజత్ పాటీదార్. బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపించిన రజత్.. కెప్టెన్‌గానూ తనదైన ముద్ర వేశాడు. తన సారథ్యంలో ఆర్సీబీ 13 మ్యాచ్‌లు ఆడి, మూడు మాత్రమే ఓడింది. 10 విజయాలతో కప్పును సొంతం చేసుకుంది. ఈసారి కూడా రజత్ మీద మంచి అంచనాలే ఉన్నాయి.

## రియాన్ పరాగ్‌పై దృష్టి

ఈసారి ఇషాన్‌ను మించి ఓ కొత్త కెప్టెన్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. అతనే.. రియాన్ పరాగ్. చాలా ఏళ్లు ఈ జట్టును నడిపించిన సంజు శాంసన్ చెన్నై సూపర్‌కింగ్స్‌కు వెళ్లిపోవడంతో పరాగ్‌కు బాధ్యతలు అప్పగించింది యాజమాన్యం. నిజానికి పరాగ్‌కు కెప్టెన్‌గా ఇప్పటికే ఒక సీజన్ అనుభవముంది. నిరుడు సంజు శాంసన్ పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గానే ఎక్కువ మ్యాచ్‌లు ఆడాడు. దీంతో పరాగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. కానీ అతడి సారథ్యంలో 8 మ్యాచ్‌లు ఆడిన రాయల్స్ రెండే గెలిచింది. రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ లాంటి ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ.. వారిని కాదని పరాగ్‌నే రాయల్స్ కెప్టెన్‌గా ఎంచుకోవడం ఆశ్చర్యం కలిగించేదే. మరి ఫ్రాంఛైజీ నమ్మకాన్ని అతను ఏమేర నిలబెడతాడో చూడాలి.





## ధోని వైభవం కొనసాగించేలా...

ధోని సారథ్యంలో వైభవం చూసిన చెన్నై సూపర్‌కింగ్స్‌ను రెండేళ్లుగా రుతురాజ్ గైక్వాడ్ నడిపిస్తున్నాడు. కానీ అతను ఎంఎస్ వారసత్వాన్ని నిలబెట్టలేకపోతున్నాడు. బ్యాటర్‌గా రాణిస్తున్నప్పటికీ.. సారథిగా ప్రభావం చూపలేకపోతున్నాడు. గత ఏడాది గాయం కారణంగా టోర్నీ నుంచి రుతురాజ్ అర్ధంతరంగా తప్పుకొంటే ధోనీనే మిగతా సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈసారి మళ్లీ జట్టు పగ్గాలు అందుకుంటున్నాడు రుతురాజ్. తాను నిష్క్రమించేలోపు సీఎస్కేను మంచి స్థితిలో నిలపాలన్నది ధోని ఆలోచన. బహుశా ఈ సీజన్లోనే మహి తప్పుకొంటే ఆశ్చర్యమేమీ లేదు. మరి అతను కోరుకున్నట్లుగా చెన్నై ఉత్తమ స్థితికి చేరుకుంటుందా? కెప్టెన్‌గా రుతురాజ్ బలమైన ముద్ర వేస్తాడా అన్నది చూడాలి. ఇప్పటిదాకా కెప్టెన్‌గా రుతురాజ్ 19 మ్యాచ్‌ల్లో సారథ్యం వహించాడు. అందులో చెన్నై 8 గెలిచి, 11 ఓడింది.



# ఆదిత్య ధర్ నీకు సెల్యూట్ - కంగనా రనౌత్

చిత్రపరిశ్రమలోకి రావాలనే ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఆదిత్యధర్ అంటూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించింది ప్రముఖ కథానాయిక కంగనా. 'ధురంధర్ ది రివెంజ్' చిత్రాన్ని దర్శకుడు ఆదిత్యధర్ తీర్చిదిద్దిన తీరుకి ఆమెకు ఎంతగానో నచ్చిందంటూ ఇన్‌స్టా స్టోరీలో తన అభిప్రాయాల్ని పంచుకుంది. "ధురంధర్' విజయంలో గొప్ప విషయం ఏమిటంటే ఆదిత్య ధర్ ఒక సూపర్ స్టార్ దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు. హాలీవుడ్ స్టార్ దర్శకులు ఎల్లప్పుడూ నటుల కంటే గొప్పవారు. కానీ, మనం మన చిత్రనిర్మాతలకు ఎప్పుడూ తగినంత గౌరవం, గుర్తింపు ఇవ్వము. వాళ్లు ఎంత కష్టపడినా తక్కువ జీతాలే పొందుతారు. అంతేకాదు సూపర్ స్టార్ల చేత వేధింపులకు కూడా గురవుతారు.

దాని ఫలితంగానే ఇండస్ట్రీలో నిర్మాతగానో, సినిమాటోగ్రాఫర్‌గానో మరే ఇతర సాంకేతిక నిపుణుడిగానో కావాలని కలలు కనే ఏ యువకుణ్ని (ఇన్‌సైడర్, అవుట్‌సైడర్) నేను కలవలేదు. ప్రతి ఒక్కరూ తాము ప్రతిభావంతులమని చెప్పుకుంటారు. కానీ, వారు కేవలం నటులు కావాలని మాత్రమే కోరుకుంటారు. ఇప్పుడు ఇక్కడ హీరోల కన్నా ఎక్కువగా వెలిగిపోతున్న ఒక సూపర్ స్టార్ దర్శకనిర్మాత ఉన్నారు. ఈరోజు ఎంతోమంది యువత ఆయన రూపొందించిన కథను చూస్తున్నారు. వారు ఆయనలా అవ్వాలని ఆకాంక్షించి చిత్రపరిశ్రమను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తారు!! సెల్యూట్ ఆదిత్య ధర్" అని ఆ పోస్ట్‌లో రాసింది కంగనా.

# 'ఇరుముడి' కోసం రీమిక్స్ పాట?



రవితేజ

కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దీనికోసం ఎంతో ప్రాచుర్యం పొందిన అయ్యప్ప గీతం "ఎక్కినాడు పల్లకి"ని రీమిక్స్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్పందించారు. ఆ పాటను రీమిక్స్ చేయమని ప్రేక్షకులు, అభిమానుల నుంచి డిమాండ్ వస్తున్న మాట వాస్తవమని.. దర్శక - నిర్మాతలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలియజేశారు. మరి త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందేమో చూడాలి. తండ్రీ–కూతురు అనుబంధాలతో ముడిపడిన ఎమోషన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ ఏడాది ఆఖర్లో తెరపైకి రానుంది. ఈ చిత్రానికి కూర్పు: ప్రవీణ్ పూడి, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ.

# మట్టన్‌చేరి మాఫియా డాన్




'భ్రమయుగం'లో రాక్షసుడిలా.. 'కలాం కావల్'లో సైకో కిల్లర్‌గా తెరపై వైవిధ్యతని ప్రదర్శిస్తూనే ప్రయోగాత్మక పాత్రలతో సినీప్రియుల్ని ఆశ్చర్యపరుస్తుంటారు మలయాళ అగ్రహీరో మమ్ముట్టి. ఇప్పుడాయన మాఫియా నేపథ్యంలో తదుపరి చిత్రానికి దర్శకుడు ఖలీద్ రెహమాన్‌తో చేతులుకలిపారు. ఈ సందర్భంగా మమ్ముట్టి సినిమా టైటిల్ పోస్టర్‌ని ఎక్స్ వేదికగా ఆవిష్కరించారు. 'మట్టన్‌చేరి మాఫియా' అనే పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో నస్లేన్ కె.గఫూర్, ఆసిఫ్ అలీ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాని దర్శకుడు.. బి.రాకేశ్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దాదాపు ఏడేళ్ల కిందట వచ్చిన 'ఉండా' సినిమా తర్వాత వీరిద్దరి కలయికలో రానున్న రెండో చిత్రమిది. గతేడాది 'జింఖానా' చిత్రంతో మంచి హిట్‌ని సొంతం చేసుకున్న దర్శకుడీయన.

# ఆదర్శవంతమైన కోడలా... దుష్టశక్తా?

ఇటీవలే 'హక్' చిత్రంలో షా బానో అనే శక్తిమంతమైన మహిళా పాత్రలో కనిపించి.. నటనతోనే ప్రేక్షకుల్ని కట్టిపడేసింది కథానాయిక యామీ గౌతమ్. తదుపరిగా కొత్త కోడలి అవతారంలో మెట్టినింటి వారిని భయపెట్టేందుకు సిద్ధమైపోయినట్లు పేర్కొంటూ రాబోయే చిత్రాన్ని ప్రకటించింది. యామీ ప్రధాన పాత్రలో బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'నయ్యి నవెల్లి'. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్ పోస్టర్‌ని ఆవిష్కరించింది చిత్రబృందం. "కొత్త కోడలిగా.. మేరట్‌లో గందరగోళంగా ఉన్న ఓ కుటుంబంలో అడుగుపెట్టిన అమ్మాయి.. దానిని స్వర్గంలా మారుస్తుంది. తను నిజంగానే ఆదర్శవంతమైన కోడలా? బహుశా వేరే లోకం నుంచి వచ్చిన దుష్ట శక్తి కూడా కావచ్చు కదా! అని తన కుటుంబంలోనే ఒకరికి అనుమానం. మరి అలాంటి విచిత్రమైన పరిస్థితుల నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది?"అనే కథాంశంతో ఈ సినిమా హారర్ కామెడీగా రూపొందనుందని చిత్రవర్గాలు తెలిపాయి.





# కొందరు రాజులు ఎప్పటికీ మరణించరు!

'శంబాల' విజయంతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించారు దర్శకుడు యుగంధర్ ముని. దీన్ని మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడిదే కాంబోలో మరో సోషియో ఫాంటసీ సినిమా పట్టాలెక్కనుంది. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు ఓ కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. యుద్ధభూమిలో ఓ సింహం, తోడేలు పోరుకు సిద్ధమవుతున్నట్లు చూపించడం.. ఆ రెండింటి మధ్య ఓ పురాతన ఖడ్గం ప్రకాశిస్తూ కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. "కొన్ని యుద్ధాలు ఎప్పటికీ ముగియవు. కొంతమంది రాజులు ఎప్పటికీ మరణించరు" అంటూ ఆ పోస్టర్‌కి జోడించిన వ్యాఖ్య సినిమాపై అంచనాలు పెంచేలా ఉంది. "ప్రేక్షకుల్ని సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇది. సందీప్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన చిత్రంగా నిలవనుంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమవుతుంది" అని నిర్మాతలు ప్రకటించారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తామన్నారు.

# క్రేజీ ప్రాజెక్ట్‌తో అనుష్క శర్మ రీఎంట్రీ

అల్లు అర్జున్ హీరోగా తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందబోతున్న విషయం తెలిసిందే.



మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న ఈ సినిమాకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. అల్లు అర్జున్ కెరీర్‌లో ఇది 23వ సినిమా. ఇందులో హీరోయిన్‌గా శ్రద్ధా కపూర్‌ను ఫైనల్ చేసినట్టు ఇటీవల వార్తలొచ్చాయి. దీనిపై ఇంకా స్పష్టత రాకముందే.. ఈ ప్రాజెక్ట్‌లో మరో బాలీవుడ్ హీరోయిన్ పేరు వినిపిస్తోంది. అనుష్క శర్మ ఇందులో కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆమె సినిమాలకు దూరమై ఎనిమిదేళ్లు అవుతోంది.షారుక్ ఖాన్ 'జీరో' తర్వాత నటిగా తన కెరీర్‌కు ఆమె బ్రేక్ ఇచ్చింది. 'చక్ దా ఎక్స్‌ప్రెస్' పేరుతో ఓ బయోపిక్ చేసినప్పటికీ అది విడుదలకు నోచుకోలేదు. ఇక బన్నీ ప్రాజెక్ట్‌తో పాటు మహేష్ బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రస్టేజియస్ మూవీ 'వారణాసి'లోనూ అనుష్క శర్మ పేరు వినిపిస్తోంది. ఇందులోని ఓ కీలకపాత్రకు ఆమెను సంప్రదించినట్టు వార్తలొస్తున్నాయి. ఏదేమైనా తన రీఎంట్రీ సౌత్ ఇండియా నుంచి రాబోతున్న ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.